# సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం, 10, మే, 2023






**పనిదినాలు కల్పించాలి**

ఈ ఆర్థిక సంవత్సరంలో కూలీలకు అత్యధిక పనిదినాలు కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ అన్నారు. - 10లో



**సహకారమందిస్తా..**

చౌటుప్పల్‌లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణానికి సహకారమందిస్తానని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. - 10లో

**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం 40°/26°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి



ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అనురాధ

భూదాన్‌పోచంపల్లి: రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయాధికారిణి అనురాధ అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ధాన్యం నాణ్యతను ఏ విధంగా పరిశీలిస్తున్నారని తెలుసుకున్నారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి ఏజాజ్ అలీఖాన్, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులున్నారు.

### కార్యదర్శులను తొలగిస్తామనడం సరికాదు

చౌటుప్పల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె విరమించి విధుల్లో చేరాలని, లేనిపక్షంలో విధుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ అన్నారు. చౌటుప్పల్‌లోని రంగారెడ్డి స్మారక భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హక్కుల సాధనకు చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూడడం మంచిదికాదన్నారు. జేపీఎస్, ఓపీఎస్‌ల సమస్యలు పరిష్కరించి వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులకు మద్దతుగా బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడతామని తెలిపారు. సమావేశంలో కొండమడుగు నర్సింహ, మాటూరి బాలరాజు, బూరుగు కృష్ణారెడ్డి, ఎండీ.పాష, బండారు నర్సింహ, పెంటయ్య, స్వామి, వెంకటేశం, శ్రీనివాస్‌చారి, అలివేలు, ఉపేందర్, రమేష్, సంజీవరెడ్డి, కిష్టయ్య, ముత్యాలు, నందీశ్వర్, మదుకృష్ణ తదితరులున్నారు.

# బాలికలదే పైచేయి

**ఇంటర్ ఫలితాల్లో 67 శాతం ఉత్తీర్ణత సాధించిన బాలికలు**

- బాలుర ఉత్తీర్ణత శాతం 58
- జిల్లాలో మొత్తం 6,440 మంది విద్యార్థులకు 4,031 మంది పాస్
- గతేడాది కంటే మెరుగైన ఫలితాలు



లావణ్య, బైపీసీ (990)



గాయత్రి, ఎంపీసీ (466)



సాయిశ్రీజ, ఎంపీసీ, 988



దినేష్, బైపీసీ, (437)

సాక్షి, యాదాద్రి: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు మంగళవారం ఉదయం 11 గంటలకు వెల్లడయ్యాయి. ఈ ఫలితాల్లో బాలుర కంటే బాలికలు మరోసారి ఉత్తీర్ణతలో పై చేయి సాధించారు. గతేడాది ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు పొందారు. ఈమేరకు ఫలితాల పట్ల డీఐఈఓ రమణి సంతోషం వ్యక్తం చేశారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 19వ స్థానం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 22వ స్థానం లభించింది. కాగా.. చౌటుప్పల్‌లోని తెలంగాణ బాలికల గురుకులం విద్యార్థిని కె.లావణ్య ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 990మార్కులు సాధించింది. అదేవిధంగా అదే కళాశాలకు చెందిన వి.గాయత్రి ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 466 సాధించింది. వలిగొండ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన కురపాటి సాయిశ్రీజ సెకండియర్ ఎంపీసీలో 1000 మార్కులకు 988 సాధించింది. సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల కళాశాలకు చెందిన ఆర్. దినేష్ బీపీసీ ప్రథమ సంవత్సరంలో 440మార్కులకు గాను 437మార్కులు సాధించాడు. అదేకళాశాలకు చెందిన ఎంపీసీ విభాగంలో 470మార్కులకు కె.రాకేష్, కె.హర్షవర్ధన్, బీ. సాయిచరణ్, బీ.గౌతమ్, ఎం.శశాంక్‌లు 466మార్కులు సాధించారు.

**జనరల్ విభాగంలో..**

→ జనరల్ ప్రథమ సంవత్సరంలో బాలురు 2,187 మందికిగాను 1,101 మంది విద్యార్థులు పాసై 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. అదేవిధంగా 2,498 మంది బాలికలకు 1,480 మంది పాసై 59 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలబాలికలు కలిపి 4,685 మందికి గాను 2,581 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 55 శాతం ఉత్తీర్ణత సాధించారు.

→ద్వితీయ సంవత్సరంలో 2,298 మంది బాలురకు 1,348 మంది ఉత్తీర్ణులై 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2,780 మంది బాలికలకుగాను 1,887 మంది పాసై 67 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలబాలికలు మొత్తంగా 5,078 మందికిగాను 3,235 మంది పాసై 63 శాతం ఉత్తీర్ణత సాధించారు.

**ప్రభుత్వ కళాశాలల్లో ఇలా..**

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 52 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆలేరు, మోత్కూరు, భువనగిరి బాలుర, బాలికల, యాదగిరిగుట్ట, రామన్నపేట, వలిగొండ, చౌటుప్పల్, పోచంపల్లి, నారాయణపురం, బొమ్మలరామంలో మొత్తంగా 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 2,572 మంది పరీక్షలకు హాజరు కాగా, 1,327 మంది ఉత్తీర్ణులయ్యారు. యాదగిరిగుట్టలో అత్యధికంగా 89 శాతం ఉత్తీర్ణత సాధించగా, బొమ్మలరామారం జూనియర్ కళాశాల 19 శాతంతో అతి తక్కువ ఉత్తీర్ణత సాధించింది.

**ప్రభుత్వ జనరల్ విభాగంలో..**

→ ప్రథమ సంవత్సరంలో 1,248 మంది పరీక్షకు హాజరు కాగా 523 మంది ఉత్తీర్ణతో 43 శాతం సాధించారు. బొమ్మలరామారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతి తక్కువగా 14 శాతంవిద్యార్థులు పాసైయ్యారు. మోత్కూరులో 28శాతం, అత్యధికంగా యాదగిరిగుట్టలో 85 శాతం, వలిగొండలో 23 శాతం, రామన్నపేటలో 80 శాతం, నారాయణపురంలో 65 శాతం ఉత్తీర్ణత సాధించారు.

→ ద్వితీయ సంవత్సరంలో 1354 మంది విద్యార్థులకు గాను 804 మంది విద్యార్థులు 59 శాతంతో ఉత్తీర్ణులయ్యారు. బొమ్మలరామారం జూనియర్ కళాశాలలో 24 శాతం, యాదగిరిగుట్ట 94 శాతం, నారాయణపురం 84 శాతం చొప్పున పాసయ్యారు.

**ఉత్తమ ఫలితాలు వచ్చాయి**

ఇంటర్ ఫలితాల్లో గతం కంటే ఉత్తమ ఫలితాలను సాధించాం. మొదటి సంవత్సరం ఫలితాల్లో జిల్లా 19వ స్థానంలో, ద్వితీయ సంవత్సరం 22వ స్థానంలో నిలిచింది. వచ్చే విద్యాసంవత్సరం మరింత మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తాం. – రమణి, డీఐఈఓ

**అన్ని కళాశాలలు కలిపి..**


జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్, మోడల్ కళాశాలల్లో మొత్తం 6,440 మంది విద్యార్థులకుగాను 4,031 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 63 శాతం నమోదైంది. మొత్తంగా బాలికల ఉత్తీర్ణత శాతం 67 కాగా.. బాలుర ఉత్తీర్ణత శాతం 58గా నమోదైంది.

→ ప్రథమ సంవత్సరంలో బాలుర విభాగంలో 3,001 మంది విద్యార్థులకు గాను 1,322 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 44 శాతం నమోదైంది. బాలికల్లో 3,206 మంది విద్యార్థులకుగాను 1903 మంది విద్యార్థులు పాసైయ్యారు. ఉత్తీర్ణత 59 శాతం నమోదైంది. బాలురు బాలికలు కలిపి మొత్తంగా 52 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

→ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో జనరల్, ఒకేషనల్ విభాగంలో బాలురుల్లో 3,023 మంది విద్యార్థులకు 1,659 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం 55 నమోదైంది. బాలికల్లో 3,417 మంది విద్యార్థులకు 2,372 మంది విద్యార్థులు పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 69 నమోదైంది.

## పుట్టిన రోజు వేడుక చేసుకోకుండానే మృత్యుఒడికి..

- బర్త్ డే వేడుక కోసం షాపింగ్‌కు వెళ్లి దుండగుడి తూటాలకు బలైన ఐశ్వర్య
- అమెరికా నుంచి నేడు హైదరాబాద్‌కు చేరుకోనున్న భౌతికకాయం



తాత తాటికొండ రామ నర్సింహారెడ్డితో ఐశ్వర్య(ఫైల్)

నేరేడుచర్ల : మరో పది రోజుల్లో పుట్టిన రోజు చేసుకోవాల్సిన ఐశ్వర్యను అంతలోనే మృత్యువు కబలించింది. పుట్టిన రోజు వేడుక సన్నాహాల్లో భాగంగా షాపింగ్‌కు వెళ్లిన ఐశ్వర్య దుండగుడి తూటాలకు బలికావడం ఆమె కుటుంబ సభ్యులను కలిచివేసింది. ఐశ్వర్య ఈ నెల 18న పుట్టిన రోజు వేడుకలను స్నేహితుల నడుమ జరుపుకోవాలని భావించింది. అమెరికాలోని టెక్సాస్ లోని ఎలెన్ సూపర్ మార్కెట్‌కు షాపింగ్ కోసం వెళ్లగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. చలాకీగా, సరదాగా ఉండే ఐశ్వర్య ఇక లేదని తెలుసుకున్న బంధువులు, స్నేహితులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. అమెరికాకు ఉన్నత చదువుల కోసం వెళ్లిన ఆమె చదువు పూర్తి కాగానే అక్కడే ఫర్‌ఫెక్ట్ జనరల్ కాంటాక్టర్స్ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తోంది. ఇంకో నెల రోజుల్లో అదే కంపెనీకి సీఈవోగా నియమించేందుకు కంపెనీ ప్రతినిధులు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. ఉద్యోగోన్నతి పొందకుండానే ఆమె కానరాని లోకాలకు వెళ్లిపో యింది. ఆమెకు వివాహం చేసేందుకు తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు కూడా చూస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 3:40 గంటలకు తల్లిదండ్రులు తాటికొండ నర్సిరెడ్డి–అరుణతో తన పుట్టిన రోజు వేడుకల సందర్భంగా షాపింగ్‌కు వెళ్తున్న విషయాన్ని ఫోన్ చేసి చెప్పింది. తల్లి దండ్రులతో అవే చివరి మాటలు. కాగా, ఐశ్వర్య భౌతికకాయం బుధవారం రాత్రికి హైదరాబాద్‌కు చేరుకోనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**ఎమ్మెల్యేల పరామర్శ**

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో దుండుగల తూటాలకు బలైన నేరేడుచర్ల మున్సిపాలిటీలోని పాత నేరేడుచర్లకు చెందిన ఐశ్వర్య కుటుంబ సభ్యులను హైదరాబాద్‌లోని వారి నివాసంలో మంగళవారం హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పరామర్శించారు. ఐశ్వర్య భౌతికకాయాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు.



## ఆరు కేంద్రాలు.. 1575 మంది విద్యార్థులు

- బీసీ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నేడు ప్రవేశపరీక్ష
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

భువనగిరి: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 2023- 24 విద్యా సంవత్సరానికి 6, 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి బుధవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో 6 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. మొత్తం 1575 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని బీసీ గురుకుల విద్యాలయాల జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

**కేంద్రాలివే..**

పరీక్ష నిర్వహణకు జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణంలో 6 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో మదర్ థెరిస్సా హైస్కూల్ ఏర్పాటు చేసిన కేంద్రంలో 312 మంది విద్యార్థులు, మాంటిస్సోరీ పాఠశాలలో 303 మంది, విజ్ఞాన్ ఐఐటీ క్యాంపస్‌లో 240 మంది, గౌతమ్ మోడల్ స్కూల్‌లో 240 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240 మంది, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 240 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు.

## విధుల్లో చేరిన 10మంది జేపీఎస్‌లు

సాక్షి, యాదాద్రి: సమ్మెను విరమించి విధుల్లో చేరాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో జిల్లాలో పది మంది జేపీఎస్‌లు విధుల్లో చేరారు. సోమవారం వరకు 17 మంది విధుల్లో ఉంటూ సమ్మెకు దూరంగా ఉన్నారు. అగ్రిమెంట్‌కు విరుద్ధంగా సమ్మెలో కొనసాగితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సమ్మెలో ఉన్న వారికి నోటీసులు అందించింది. దీంతో యాదగిరిగుట్ట మండలానికి చెందిన పది మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం తమ విధుల్లో చేరారు. కాగా.. జిల్లా వ్యాప్తంగా 333 మంది సమ్మెలో కొనసాగుతున్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని నాగార్జున, కనకదుర్గ రైస్‌మిల్లులను సివిల్ సప్లయ్ డీఎం మురళీకృష్ణతో కలిసి సందర్శించారు. అక్కడ ధాన్యం లోడు దిగుమతిలో ఎదురవుతున్న ఇబ్బందులు, జాప్యానికి గల కారణాలను మిల్లర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు, మూడు విడతలుగా కురిసిన అకాల వర్షాలతో ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యమైందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4లక్షల మెట్రిక్ ధాన్యం వస్తుందని అంచనా వేయగా, ఇప్పటి వరకు 90వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. అయితే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సివిల్ సప్లయ్ నుంచి ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాలేదని చెప్పారు. అయినా అనధికారికంగా తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నామని, ఇప్పటి వరకు 20వేల మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతానికి లారీలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేదని, కొనుగోళ్లు సవ్యంగా జరుగుతున్నాయన్నారు. ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా 12 నుంచి 15వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం కాంటావేస్తున్నామని చెప్పారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ జిల్లా అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారిణి అనురాధ, తహసీల్దార్ వీరాబాయి, ఏఓ ఏజాజ్ అలీఖాన్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

## మిల్లర్లు పూర్తిస్థాయిలో సహకరించాలి

- ఆర్డీఓ కంచర్ల వెంకటఉపేందర్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటఉపేందర్‌రెడ్డి

చౌటుప్పల్: ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైస్ మిల్లర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆర్డీఓ కంచర్ల వెంకటఉపేందర్‌రెడ్డి సూచించారు. ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం దిగుమతి చేసుకొని కొనుగోలు కేంద్రాలకు, రైతులకు అండగా నిలవాలని తెలిపారు. చౌటుప్పల్ మండల పరిధిలోని మసీదుగూడెం, పెద్దకొండూరు, నేలపట్ల, జైకేసారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కుంట్లగూడెం గ్రామ శివారులోని శుభోదయ రైస్ ఇండస్ట్రీని సందర్శించి, యాజమాన్యంతో మాట్లాడారు. రవాణా సమస్య తీవ్రంగా ఉందని గ్రహించిన ఆర్డీఓ సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రతిరోజు పెద్ద సెంటర్‌కు 4, చిన్న సెంటర్‌కు 2 చొప్పున వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్, సీఈఓ ఎరుకల రమేష్, డైరెక్టర్లు తదితరులున్నారు.

## క్లుప్తంగా

### ధాన్యం చోరీ

అర్వపల్లి: మండల పరిధిలోని ఉయ్యాలవాడ సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం రాత్రి రైతు గోండ్ర సైదులుకు చెందిన 80బస్తాల ధాన్యాన్ని దొంగలు చోరీ చేశారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు. విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరాడు.

### రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఆలేరురూరల్ : రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆలేరులో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సాయిబాబా దేవాలయం సమీపంలో గల రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడి వద్ద ఆధారాలు సేకరించారు. మృతుడు నేపాల్‌కు చెందిన షాలిక్ రామ్ (35)గా గుర్తించారు. ఇతను గుర్తుతెలియని రైలు నుంచి జారిపడడంతోనే మృతిచెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

### ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి


రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

ఆలేరురూరల్ : రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని జయశంకర్ విశ్వ విద్యాలయం ఈఈఐ శైలజ సూచించారు. ఆలేరు మండలంలోని గొలనుకొండ గ్రామంలో మంగళవారం రైతులకు పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష, సునీత, ఏడీఏ వెంకటేశ్వర్లు, ఉద్యానవన శాఖ అధికారి సైదులు, నవీన్, పట్టు పరిశ్రమ శాఖ అధికారి వీరకుమార్, ఏరువాక సైంటిస్ట్ డాక్టర్ అనీల్ పాల్గొన్నారు.

# పేదింటి విద్యాకుసుమాలు

- ఇంటర్‌లో మెరిసిన విద్యార్థులు
- ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ మార్కులు
- ప్రభుత్వ కొలువులు సాధించి ప్రజా సేవ చేస్తామని వెల్లడి

మిర్యాలగూడ : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పేదింటి విద్యాకుసుమాలు మెరిసారు. కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలకు దీటుగా మార్కులు సాధించి సత్తా చాటారు. భవిష్యత్‌లో ఇదే తరహాలో ఉన్నత విద్యలో దూసుకుపోతామంటున్నారు. అత్యున్నతమైన ప్రభుత్వ కొలువులు సాధించి ప్రజాసేవ చేస్తామని పేర్కొంటున్నారు.

**హెచ్‌ఈసీలో ఉత్తమ ప్రతిభ**


విద్యార్థిని అయేషాఫిర్దోస్

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించిన పట్టణానికి చెందిన అయేషాఫిర్దోస్ ఇంగ్లిషు మీడియం హెచ్‌ఈసీ విభాగంలో 476/500 మార్కులు సాధించింది. మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు షేక్ ఖాజా హసీనాలకు ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు అయేషా మొదటి నుంచి చదువుపై మక్కువతో పట్టుదలతో చదివి ప్రతిభను ప్రదర్శించింది. ప్రభుత్వ కళాశాలలో సైతం ఇంత మంచి బోధన అందించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపింది.

**సివిల్స్ లక్ష్యంగా.. విద్యార్థిని అయేషా**

భవిష్యత్తులో సివిల్స్ లేదా న్యాయ శాఖలో ఉద్యోగం సాధించేందుకు ఇంటర్మీడియట్‌లో హెచ్‌ఈసీ విభాగాన్ని ఎంచుకున్నా. కొన్ని అనివార్య కారణాలతో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం ఆలస్యమైంది. ఉన్న కొద్ది సమయంలోనే కష్టపడి చదివా. భవిష్యత్తులో చదువును కొనసాగించి నేను అనుకున్న లక్ష్యాన్ని నేరవేర్చుకుంటా.


చౌటుప్పల్ : తల్లిదండ్రులతో గాయిత్రి

**తల్లిదండ్రుల, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే..**


అయోషా బేగం

భువనగిరి : మోటకొండూర్ మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మహ్మద్ అబీబ్, రజీయాభేగం దంపతుల కుమార్తె ఆయోషా భేగం. పట్టణంలోని శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతుంది. మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో 468/470 మార్కులు సాధించింది. రాష్ట్ర స్థాయిలో నిలిచే విధంగా మార్కులు సాధించిన విద్యార్థి పేద కుటుంబానికి చెందినది. భవిష్యత్తులో కలెక్టర్ కావాలనే లక్ష్యంతోనే రోజుకు 15 నుంచి 16 గంటల పాటు చదువుతున్నానని పేర్కొంటోంది. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే ప్రతిభ చూపినట్లు పేర్కొంటోంది.

**తండ్రి చనిపోయినా మొక్కవోని ధైర్యంతో..**

సూర్యాపేటటౌన్ : ఆత్మకూర్.ఎస్ మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన కొమ్ము యాదయ్య-సుశీల కుమార్తె ప్రశాంతి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివింది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో బైపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 979మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. ప్రశాంతి తండ్రి యాదయ్య కరోనా సోకి మరణించారు. తండ్రి చనిపోయినా తన తల్లి సుశీల కూలీనాలి చేసుకుంటూ కూతురును ఇంటర్మీడియట్ చదివించింది. ప్రశాంతి అధైర్యపడకుండా ప్రభుత్వ కళాశాలలో చదివి ఉత్తమ మార్కులు సాధించి టాపర్‌గా నిలిచి పలువురికి ఆదర్శంగా నిలిచింది.

**డాక్టర్ కావమే లక్ష్యం : కొమ్ము ప్రశాంతి**

భవిష్యత్‌లో డాక్టర్ అవ్వడమే నా లక్ష్యం. నీట్ పరీక్ష కూడా రాశాను. తన తండ్రి కరోనాతో చనిపోయారు. డబ్బులు లేక మా నాన్నను బతికించుకోలేకపోయాము. మానాన్న లాంటి పరిస్థితి ఎవరికి రాకుండా డాక్టర్ అయి పేద వారికి తనవంతు సహాయం చేస్తాను. తన తల్లి కూలీ పని చేసుకుంటూ నన్ను చదివిస్తుంది. కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకుల ప్రోత్సహం ఎంతగానో ఉంది.

**ఐఏఎస్ కావడమే లక్ష్యంగా...**

దేవరకొండ పట్టణ కేంద్రానికి చెందిన పేద కుటుంబీకుడైన విగ్రహాల కరుణాకర్-నీరజ దంపతులకు ముగ్గురు అమ్మాయిలు. కరుణాకర్ వెల్డింగ్ పని చేస్తుంటాడు. పిల్లలను మాత్రం ఉన్నంతలో ఏ లోటూ రాకుండా బాగానే చదివిస్తున్నాడు. చిన్న కుమార్తె గాయిత్రి చౌటుప్పల్‌లోని గురుకులంలో ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతుంది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 466మార్కులు సాధించింది. కలెక్టర్ కావడమే లక్ష్యంగా కఠోరమైన సాధన చేసి చక్కటి ప్రతిభతో అందరితో శభాష్ అనిపించుకుంది. ఎన్ని ఇబ్బందులెదురైనా కలెక్టర్ కావాలన్న తన లక్ష్యాన్ని చేరుకుంటానని గాయిత్రి ధీమాగా ఉంది.

**కూలీ కుటుంబంలో పుట్టినా..**


విద్యార్థిని నవ్య

చిలుకూరు : చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడేనికి చెందిన గాలి సైదులు, సునితల రెండో కుమార్తె గాలి నవ్య ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరంలో 434 మార్కులు సాధించింది. కూలీ కుటుంబంలో పుట్టినా నవ్య చదువులో ముందువరుసలో నిలిచి అందరి మన్ననలు పొందుతోంది. నవ్య టెన్త్ క్లాస్ యాదాద్రి జిల్లా రామన్నపేట గురుకుల పాఠశాలలో చదివింది. అ తరువాత గురుకుల పరీక్ష రాసి హైదరాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ గౌలిదొడ్డి కళాశాలలో బైపీసీలో చేరి ప్రతిభ చూపింది.

**పేదరికాన్ని జయించి..**


తలిదండ్రులతో లావణ్య

చౌటుప్పల్ : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి మండలం తునికిమూతలతండాకు చెందిన కొర్ర దేవునాయక్, కంశ దంపతుల కుమార్తె లావణ్య పేదరికాన్ని జయించింది. తండ్రి డోజర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పేదరికం కారణంగా లావణ్య ఐదవ తరగతి నుంచి చౌటుప్పల్‌లోని తెలంగాణ బాలికల గురుకులంలో చేరింది. ఇంటర్ బైపీసీలో 990 మార్కులు సాధించి చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది. తాను పెద్దయ్యాక గైనిక్ విభాగంలో పెద్ద డాక్టర్‌గా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. కలను సాకారం చేసుకుంటానని పేదలకు సేవ చేస్తానని లావణ్య చెబుతోంది. తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్, అధ్యాపకుల సహకారంతో ఈ ఘనత సాధించానని గుర్తు చేసుకుంది.

## ఫలితాల్లో ప్రగతి కళాశాల జయకేతనం


దూపంత్‌కుమార్ బైపీసీ 990


జ్యోతిర్మయ్ బైపీసీ 990


వీరమల్ల సిరి ఎంపీసీ 990


చందనదుర్గ బైపీసీ 434


మౌనిక ఎంపీసీ 467

నల్లగొండ : ఇంటర్ ఫలితాల్లో ప్రగతి జూనియర్ కళాశాల ప్రభంజనం సృష్టించింది. బైపీసీ, ఎంపీసీ విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిలిచారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో బి.శ్రీలేఖ వెయ్యి మార్కులకు 990 మార్కులు సాధించి రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉన్నారు. అదేవిధంగా కె. జ్యోతిర్మయ్, దూపంత్‌కుమార్‌లు 990 మార్కులు సాధించగా సీహెచ్ వేద 989 మార్కులు పొందింది. హేమలత, నాగలక్ష్మి 988 మార్కులు సాధించారు. కాగా, ఎంపీసీ విభాగంలో వీరమల్ల సిరి 990 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులు సాధించిన వారిలో నిలువగా ఉప్పునూతల గౌతమి , తేలుకుంట్ల ప్రణతిలు 989 మార్కులు సాధించారు. కాగా బొడ్డుపల్లి చరిత, కట్టబోయిన శ్రీవల్లి, వైద్యపు ప్రగతి, వద్దిరెడ్డి సౌజన్యలు 988 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. రాష్ట్ర స్థాయిలోనే కళాశాలకు , జిల్లాకు పేరు సంపాదించారు. కాగా ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో రాయిన బోయిన మౌనిక 467మార్కులు సాధించగా పోగుల పూజ శ్రీ 466, అవారి వైష్ణవి 465, బత్తుల రమ్యశ్రీ 465, చంద సంశ్రీత, శ్రీజ, కూరపాటి హర్షిత, తాటి సిరిశ్రీ, యాకాలపు మీనాక్షి, బైరం వెన్నెల, మాదగోని పూజలు 465మార్కులు సాధించారు. అదేవిధంగా బైపీసీ విభాగంలో రెడ్డిశెట్టి చందనాదుర్గ 434, కాకులారపు విష్ణుకుమార్ 433, నీలం అనురాధ 432, దుష్యశ్రీ సుష్మత 431, మాలోతు అశ్రిత, చేపూరి శ్రీవైష్ణవిలు 430 మార్కులు పొందారు.

## ఫలితాల్లో సత్తా చాటిన 'కృష్ణవేణి' విద్యార్థులు


విద్యార్థులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న కృష్ణవేణి డైరెక్టర్ వెంకటేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారని కృష్ణవేణి కళాశాల డైరెక్టర్లు గొల్లపుడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వెయ్యి మార్కులకు పి.రాజేష్ 994మార్కులు, సీహెచ్.రోహిత 990, వై.కావ్య 990, కె.యమున, పి.కావ్య 989, ఆర్.భావనస్ఫూర్తి, తేజస్విని 988, బి.అమిత, టి.సమత, డి.మనోజ్, జి.శ్రీహాసిని రెడ్డి, సీహెచ్.వైష్ణవి 987, ఆర్.సిరి అక్షయ 986, ఎస్.మేఘశ్రీ 986, ఏ.వర్షిణి, డి.లహరి, ఎం.రష్మిత 985 మార్కులు సాధించారని పేర్కొన్నారు. బైపీసీలో సీహెచ్.లక్ష్మి 989, పి.కావ్య 989, కె.లీనాభార్గవి 987మార్కులు, ఎంఈసీలో కె.శారదా శ్రీ హిమజ 986, వి.దుర్గతన్మయి 984మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఎంపీసీలో 470మార్కులకు కె.జ్ఞానిత, ఎం.చాతుర్య, ఎం.వేణు, ఏ.నాగచైతన్య, కె.జ్యోత్స్న, డి.త్రిశిక, జి.చందన ప్రియ, కె.హర్షవర్ధన్ 466మార్కులు, వి.హాసిని, ఎం.జీవని, ఎం.చరణ్, జి.సంతోష్, ఎస్.సుమంత్, వై.వేదిక, కె.సంజయ్, ఎస్.ఈశ్వర్ 465మార్కులు సాధించారన్నారు. బైపీసీలో 440మార్కులకు కె.జిషితా దేవి, ఎస్.కె.ఫర్హాత్ అజీస్, కె.సాయికిరణ్, బి.ఉమాశ్రీ, ఎం.సాధ్కి, ఏ.దివ్య మేఘన శైవార్షిత, ఎల్.పూజిత 434మార్కులు, బి.మెర్సీ 433మార్కులు, సీఈసీలో 500మార్కులకు ఎస్.కె.సుహానా 478,ఎస్‌కె.నమీనా 475మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, అకడమిక్ ఇన్‌చార్జ్ వంశీకృష్ణ, డీన్ శేఖర్‌బాబు, ఏఓ నిరంజన్ పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో 'గౌతమి' ఉత్తమ ఫలితాలు


నిషాత్ ఫాతిమా బైపీసీ 987


ఎ. పూజిత బైపీసీ 987


షేక్ అఫ్రీన్ ఎంపీసీ 467


అబ్దుల్ రెహమాన్ ఎంపీసీ 467


షహన అలీఖాన్ బైపీసీ 435

నల్లగొండ : ఇంటర్మీడియట్‌లో గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎం.అక్షిత వెయ్యి మార్కులకు 993 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలోనే రెండవ వరుసలో నిలిచింది. బైపీసీ విభాగంలో నిషాత్ ఫాతిమా, ఎం. పూజిత వెయ్యి మార్కులకు 987 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభను కనబర్చారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో షేక్ అఫ్రీన్, ఎండీ అబ్దుల్ రెహమాన్ 470 మార్కులకు 467 మార్కులు సాధించారు. అదేవిధంగా బద్దం శ్రీసాయి, గుజ్జుల పూజిత, శ్రీవర్షిని, వడ్డె పూజిత, మణిదీప్, జెల్ల చందులు 466 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో షహన అలీఖాన్ 440 మార్కులకు 435 మార్కులు సాధించి ముందువరుసలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్ల వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్‌రెడ్డి, పుట్ట వెంకటరమణారెడ్డిలు అభినందించారు. తమ అధ్యాపకుల నిరంతరంగా నిర్వహించిన పరీక్షలు సత్ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. అయితే నల్లగొండ జిల్లాలో ఇప్పటివరకు ఎంపీసీ విభాగంలో 993 మార్కులు రావడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు.

### రైస్‌మిల్లు వద్ద రైతుల ఆందోళన

- ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోవాలని డిమాండ్

టీటీనగర్: మండలంలోని భట్టుగూడెం గ్రామ పరిధిలో గల కాదాంబరి రైస్‌మిల్లు వద్ద మంగళవారం రైతులు ఆందోళన చేపట్టారు. పీఏసీఎస్ కేంద్రాల్లో తమ ధాన్యానికి తేమ, తాలును పరిశీలించి కాంట వేసినప్పటికీ రైస్‌మిల్లు యాజమాన్యం తేమ లేదనే సాకుతో అన్‌లోడ్ చేసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మ్యాచర్ పేరుతో క్వింటాకు 5కిలోల చొప్పున ధాన్యాన్ని తరుగు తీస్తున్నారని వాపోయారు. ధాన్యాన్ని తరుగు తీయకుండా మ్యాచర్ ఉన్న వాటిని అన్‌లోడ్ చేసుకోవాలని రైతులు యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి రైస్‌మిల్లు వద్దకు చేరుకొని యాజమాన్యంతో చర్చించారు. రైతులకు ఇబ్బందులకు గురి చేయకుండా పీఏసీఎస్ కేంద్రాల ద్వారా మ్యాచర్ ఉండి, కాంట వేసిన ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాలకృష్ణగౌడ్, ఎంపీటీసీ బాలచందర్, సర్పంచ్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీచైతన్య ప్రభంజనం


మాట్లాడుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470మార్కులకు ఎం.శిరీష, బి.సాయిపూజ, టి.యజ్ఞశ్రీ, కె.సదాచంద్, టి.కిరణ్‌కుమార్, ఎం.గేయ సంతోష్, కె.సిరి, సీహెచ్.భార్గవి, సీహెచ్.సింధు ప్రియ, ఇ.భావ్యశ్రీ, వి.కరుణ 467 మార్కులు సాధించారు. ఇక బైపీసీలో 440 మార్కులకు జి.కావ్య 436, ఎస్‌కె.నసీమ్ 435, సీఈసీలో ఎస్.కే.అర్మాన్‌పాషా 500 మార్కులకు 490, హెచ్‌ఈసీలో 500 మార్కులకు వి.లక్ష్మీశ్రీజ 484 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే, సీనియర్ ఎంపీసీలో వెయ్యి మార్కులకు ఆర్.లోకేష్ 992, ఆర్.ఉషశ్రీ 992, ఎ.ఇందు 991, ఎస్.భరత్, ఎస్.డీ.సాదియా తక్విమ్, సీహెచ్.శ్రీవాస్తవ్ 990 మార్కులు, సీనియర్ బైపీసీలో వెయ్యి మార్కులకు పి.గాయత్రి, కె.పూజిత 992మార్కులు, బి.మేఘన 991, కె.జాన్వితదేవి, ఎ.యామిని 990, కె.దేవి శరణ్య, సునైన 989 మార్కులు, ఎ.కీర్తి 988, ఎస్.శ్రీరామ్ 986, గణేష్, హరిణి 985 మార్కులు సాధించారని పేర్కొన్నారు. కాగా, సీనియర్ ఎంఈసీలో ఎ.తేజశ్రీ సాయి వెయ్యి మార్కులకు 985, సీఈసీలో నికితాదాస్ 963 మార్కులు పొందారు. ఆయా విద్యార్థులను చైర్మన్, డైరెక్టర్‌తో పాటు అకడమిక్ డైరెక్టర్ బి.సాయిగీతిక, డీజీఎం సీహెచ్.చేతన్‌మాధుర్, అకడమిక్ డీన్ ఎన్.ఆర్.ఎస్.డీ.వర్మ, ఏజీఎంలు బ్రహ్మం, పకాష్, గోపాలకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

### 'గీతాంజలి' విద్యార్థుల ప్రతిభ


ఇందు ఎంపీసీ 992


నిఖిల, ఎంపీసీ 466


చంద్రిక బైపీసీ 436

నల్లగొండ : ఇంటర్ ఫలితాల్లో గీతాంజలి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో నిలిచారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో డి.ఇందు 992, జి.లిఖితారెడ్డి 987 మార్కులు ఎస్.రాజేశ్వరి 986, వై శివకృష్ణ 986, వి చందురెడ్డి 986, ఎం.అంజలి 983, ఎం చరణ్‌తేజ 983 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో శ్రావణి 980 మార్కులు సాధించింది. కాగా మొదటి సంవత్సరం ఎంపీసీలో ఆర్.నిఖిల 466, సౌమ్య 466, లిఖిత 464, శ్రీవాణి 464, బైపీసీలో చంద్రిక 436, పూజిత 433 మార్కులు సాధించారు.

## సినీఫక్కీలో రైతువద్ద నుంచి నగదు చోరీ


బాధిత రైతు దంపతులు సుల్తాన్ వెంకటయ్య, లక్ష్మమ్మ

శాలిగౌరారం: దుండగులు సినీఫక్కీలో రైతు వద్ద నుంచి 1.90లక్షలు చోరీ చేశారు. ఈ ఘటన శాలిగౌరారంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని అడ్లూరు గ్రామానికి చెందిన రైతు సుల్తాన్ వెంకటయ్య తనకున్న నాలుగున్నర ఎకరాలలో వరిపంట సాగుచేశాడు. పంట దిగుబడులు 140.80 క్వింటాళ్ల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించగా రూ. 2.90 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ య్యాయి. అందులోంచి రూ. 1.90 లక్షలను డ్రా చేసేందుకు భార్య లక్ష్మమ్మతో కలిసి వెంకటయ్య సోమవారం బ్యాంకుకు బైక్‌పై వచ్చాడు. వెంకటయ్య దంపతులు బ్యాంకులోని క్యాష్‌కౌంటర్ వద్ద నగదును డ్రాచేసుకున్నారు. నగదును చిన్న బ్యాగులో వేసుకొని ఆ బ్యాగ్‌ను మరో పెద్ద సంచిలో వేసుకొని బ్యాంకునుంచి బయటకు రాగా బైక్‌లో గాలిపోయి ఉంది.

**దురదమందు స్ప్రే చేసి.. బాటసారులుగా దృష్టి మరల్చి..**

దంపతులు నగదు ఉన్న సంచిని మోపెడ్ తగిలించి నెట్టుకుంటూ వెళ్లేందుకు ప్రయత్నించగా దొంగలు వారివెంట బాటసారులుగా వెళ్లారు. మొదటగా వెంకటయ్య భార్య లక్ష్మమ్మపై దురదమందును స్ప్రే చేశారు. దీంతో కొన్ని క్షణాల్లోనే ఆమె శరీరంపై దురద రావడంతో చూపించుకునేందుకు బ్యాంకు పక్కన ఉన్న ఓ ఆర్ఎంపీ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో వైద్యుడు లేకపోవడంతో ఇంటికి వెళ్లే క్రమంలో ఓ కిరాణదుకాణం వద్ద వస్తువులు కొనుగోలు చేసేందుకు లక్ష్మమ్మ వెళ్లింది. ఇంతలో వెంకటయ్య కూరగాయల కోసం సంతలోకి వెళ్తుండగా దొంగలు అతడిపై కూడా దురదమందు స్ప్రే చేశారు. దీంతో అతను దురదతో ఇబ్బంది పడుతుండటంతో దొంగలు దగ్గరకు వచ్చి నీ బట్టలపై పురుగులు ఉన్నాయని చెప్పారు. దీంతో అతను మోపెడ్‌ను పక్కను నిలిపి చొక్కా విప్పి దులుపుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో దుండగులు మోపెడ్‌కు ఉన్న సంచిలోంచి నగదు ఉన్న బ్యాగ్‌ను తీసుకొని వెళ్లిపోయారు. కొద్ది సేపటికి వెంకటయ్య గమనించగా నగదు సంచి కనిపించకపోవడంతో లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సతీష్ నేతృత్వంలో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాక్టర్ పైనుంచి పడి బాలుడి దుర్మరణం


ప్రజ్వల్ రెడ్డి (ఫైల్)

వలిగొండ : ట్రాక్టర్ పైనుంచి పడి ఓ బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎం.తుర్కపల్లి గ్రామానికి చెందిన బద్దం చంద్రశేఖర్‌రెడ్డి బతుకుదెరువు నిమిత్తం పదేళ్ల క్రితం మేడ్చల్ జిల్లా అత్తివేలు గ్రామానికి కుటుంబంతో సహా వలస వెళ్లి ప్రైవేట్ ఉద్యోగిగా జీవనం సాగిస్తున్నాడు. అయితే, వ్యవసాయ పనుల నిమిత్తం వారం రోజుల క్రితం చంద్రశేఖర్‌రెడ్డి స్వగ్రామానికి కుటుంబ సమేతంగా వచ్చాడు. మంగళవారం చంద్రశేఖర్‌రెడ్డి తన కుమారుడు ప్రజ్వల్‌రెడ్డి (9)తో కలిసి సోదరుడు శ్రీకాంత్‌రెడ్డి ట్రాక్టర్‌పై వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రజ్వల్‌రెడ్డి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే వలిగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెన్‌పహాడ్ : విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ...గ్రామానికి చెందిన నాగెల్లి సందీప్ (సాయి) (22)తన ఇంట్లోని బావికి మోటార్ వేసి వైర్‌లు సరిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఒక వైరు తెగి అతనిపై పడడంతో విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడని తెలిపారు.



### ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి

మద్దిరాల : ట్రాక్టర్ కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలో మగళవారం చోటు చేసుకుంది. అర్వపల్లి మండల పరిధిలోని జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోలెబోయిన అజయ్(20), పోలేబోయిన సాయికుమార్ ట్రాక్టర్ ద్వారా మండల పరిధిలోని కుక్కడం గ్రామానికి ఇసుకను తీసుకెళ్లి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని గుమ్మడవెల్లి శివార్లో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పింది. రోడ్డు కిందకు దూసుకెళ్తుండగా ట్రాక్టర్ నడుపుతున్న అజయ్ కిందికి దూకాడు. దీంతో ట్రాక్టర్ చక్రాలు అతని పైనుంచి వెళ్లడంతో మృతిచెందాడు. ట్రాక్టర్ మీద ఉన్న సాయికుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌కు సీపీ అభినందన

భువనగిరి : దక్షిణ కోరియాలో ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఆసియా పసిఫిక్ మాస్టర్ గేమ్స్ అథ్లెటిక్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్‌ను మంగళవారం రాచకొండ కమిషనర్ సీపీ డీఎస్ చౌహాన్ హైదరాబాద్‌లో అభినందించారు. కార్యక్రమంలో డీసీపీ రాజేష్ చంద్ర, అదనపు డీసీపీ హనోక్ జయకుమార్ ఉన్నారు.

### బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

నాగార్జునసాగర్: బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన నందికొండ మున్సిపాలిటీలో జరిగింది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ మాచర్ల మండలం రైట్‌బ్యాంకుకు చెందిన గుంటి ప్రతాప్ (32), బాలప్రశాంత్ సోమవారం అర్ధరాతి దాటాక హైలాన్ నుంచి హిల్‌కాలనీకి వస్తున్నారు. పాత లాంచీస్టేషన్‌కు సమీపంలో బైకు అదుపు తప్పి కంపచెట్ల లోకి దూసుకుపోయింది. బండి మీదనుంచి రాళ్లపై పడటంతో గుంటి ప్రతాప్ (32) అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న బాలప్రశాంత్(సన్నీ)కు గాయాలయ్యాయి. స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం హైదరాబాద్‌కు తరలించారు.

### మర్యాలలో ఆర్మీ అధికారి సందర్శన


అధికారులకు సూచనలు ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ జనరల్ శర్మ

బొమ్మలరామారం : మండలంలోని మర్యాల గ్రామంలోని సర్వే నంబరు 343లో ఆర్మీ అధికారులకు రిజర్వు బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని ఇన్‌స్పెక్టర్ జనరల్ డీ.కే శర్మ మంగళవారం సందర్శించారు. గతంలో ఆర్మీ అధికారులకు 56 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేశారు.హెడ్ క్వాటర్స్ నిర్మాణం కోసం మరింత భూమి అవసరముందని ఆర్మీ అధికారులు తెలుపగా ఇటీవలే 27 ఎకరాల 27 గుంటల భూమిని అందజేసేందుకు సర్వే పూర్తి చేసినట్లు తహసీల్దారు పద్మ సుందరి తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ వెంకట్ రెడ్డి, సర్వేయర్ శ్రీనివాస్, గోవర్ధన్ ఉన్నారు.

## బాణామతి చేశారంటూ బురిడీ

- అమాయకుల నుంచి రూ.లక్ష వసూలు చేసిన దొంగ గురూజీ
- మోసపోయామని గ్రహించి డబ్బు అడిగితే ఇవ్వనని బెదిరింపులు
- బంధువుల సాయంతో గురూజీని చితకబాదిన బాధితులు

కోదాడరూరల్ : నీ బిడ్డకు బాణామతి చేశారని.. ఓ దొంగ గురూజీ అమాయకులను బురిడీ కొట్టించి రూ.లక్ష వసూలు చేశాడు. మోసపోయామని గ్రహించిన బాధితులు డబ్బులు తిరిగి అడగ్గా ఇవ్వకపోవడంతో బంధువుల సాయంతో అతడిని చితకబాదారు. ఈ సంఘటన కోదాడ పట్టణంలో పోలీస్ స్టేషన్ పక్కనే మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో పండ్లబండి నడుపుకుంటూ జీవనం సాగించే ఓ మహిళ కూతురు ఏడాది కిందట జ్వరం బారిన పడింది. జ్వరం తగ్గకపోవడంతో వారు పోలీస్‌స్టేషన్ పక్కనే జ్యోతిష్యాలయం పేరుతో ఉన్న గురూజీ సంజీవరాజు వద్దకు వెళ్లారు. దీంతో అతను వారి అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని నీ బిడ్డకు బాణామతి(చేతబడి) చేశారని, దీనికి విరుగుడుగా పూజలు చేయాలని తెలిపాడు. లేకపోతే నీ బిడ్డ బతకదని అందుకు లక్ష రూపాయాల ఖర్చు అవుతుందని తెలిపాడు. దీంతో ఆమె బిడ్డ ప్రాణాలే ముఖ్య మని లక్ష రూపాయాలు ఇచ్చింది. అతర్వాత గురూజీ తమను మోసం చేశాడని గ్రహించి బాధితురాలు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగింది. దీంతో దొంగ గురూజీ వారిని మీరు డబ్బులు వేరే వారిని ఇబ్బందులకు గురి చేయడానికి తనకు ఇచ్చారని ఈ విషయాన్ని వారికి చెబుతానని బ్లాక్‌మెయిల్‌కు దిగాడు. మరోసారి అసలు నాకు డబ్బులు ఇవ్వలేదంటూ సదరు బాధితులను పలు రకాలుగా బ్లాక్ మెయిల్ చేశాడు. ఏడాది కాలంగా తిరుగుతున్న డబ్బులు ఇవ్వకపోవడంతో చేసేదేం లేక మోసపోయిన విషయాన్ని బాధితులు వారి బంధువులకు తెలిపారు. వారు గురూజీ దగ్గరకు వెళ్లి డబ్బులు అడిగితే ఇవ్వకుండా మాయమాటలు చెబుతుండటంతో ఆగ్రహించిన వారు అక్కడే అతడిని చితకబాదారు. గట్టిగా నిలదీయడంతో డబ్బులు తిరిగి ఇస్తానని ఒప్పుకున్నాడు. దీంతో అతన్ని వదిలేశారు. కాగా, ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.